జాస్తి రత్తయ్య






నా అమెరికా ప్రయాణం గురించీ, తొలినాళ్ళలో అమెరికాలోని నా జీవనం గురించీ తెలుసుకోవాలంటే..దాదాపు యాభై రెండేళ్ళు వెనక్కి వెళ్ళాలి.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్త రోజులు.. మా స్వగ్రామం తెనాలికి సుమారు 13 మైళ్ళ దూరంలో వున్న బోడపాడు అనే పల్లెటూరు. మావూరికి దగ్గరలో ఉన్న తిరుమళ్ళలో హైస్కూలు చదువు పూర్తయ్యాక గుంటూరు ఎ.సి. కాలేజీలో బిఎస్సీ ఫిజిక్స్ డిగ్రీ చదివాను. మా ఇంట్లో హైస్కూలు దాటి చదివిన మొదటి వ్యక్తిని నేనే. గుంటూరులో చదువయ్యాక ఒక ఆరునెలల పాటు చీరాల హైస్కూల్లో మాస్టారు ఉద్యోగం చేశాను... ఇదే సమయంలో 1948 లో కొల్లూరికి చెందిన వెంకట రమణమ్మ తో నాకు వివాహం జరిగింది. ఎలా కలిగిందో గానీ ఉన్న వూర్లోనే అలా పొలాల్లో పనిచేస్తూ ఉండిపోకూడదన్న భావం స్థిరంగా నాలో నాటుకు పోయింది..అందుకే హైస్కూలు ఉద్యోగం అంతగా నన్ను కట్టి ఉంచలేక పోయింది. పై చదువులు చదవాలన్న ఉత్సాహం నన్ను అక్కడ నిలవనివ్వలేదు.

మద్రాసు ఎం.ఐ.టి లో ఎయిరోనాటికల్ ఇంజినీరింగ్ లో 1949 లో చేరి 1952 లో గ్రాడ్యుయేట్ అయ్యాను. అక్కడినుంచీ నా ప్రయాణం బెంగుళూరులోని ఐ.ఐ.ఎస్.సి కి. అక్కడ ఏరో నాటికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ లో రీసెర్చి కోసమని జాయిన్ అయ్యాను. ఫేమిలీని కూడా బెంగుళూరుకి తీసుకెళ్ళాను. ఆ రీసెర్చిలో మునిగి పోయాను. నా రీసెర్చి దీక్షగా జరుగుతున్న రోజుల్లోనే అప్పటికే అమెరికాలో చదువుతున్న, ఒకప్పటి ఎం.ఐ.టి లో నా సహాధ్యాయి ఐన, కె.వి.కె రాజు నుంచీ నాకో వుత్తరం వచ్చింది. ( ఈ కె.వి.కె. రాజు గారే తరువాత ఆంధ్ర దేశంలో ప్రఖ్యాతి గాంచిన నాగార్జునా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ని స్థాపించి, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగాన్ని ఒక కొత్త మలుపు తిప్పారు.) ఉత్తరం లోని సారాంశం , సందేశం ఏమిటంటే నన్ను అమెరికా రమ్మనీ, అక్కడి చదువులు బావుంటాయనీ.

విద్యార్జనలో మావూరునుంచీ, మద్రాసు మీదుగా బెంగుళూరు చేరుకున్నాను., ఇప్పుడు అమెరికాకి వెళ్ళాలా వద్దా..ఒక సంశయం.. మా ప్రొఫెసర్ జోగారావు గారిని సలహా అడిగితే ఆయన అమెరికా చదువుగురించి అంతగా ఆసక్తి చూపించలేదు. బెంగుళూరులోనే ఉండిపోయి డాక్టరేట్ పూర్తి చెయ్యమని సలహా ఇచ్చారు. ఐతే రెండో వైపునుంచీ మిత్రుడు రాజు నన్ను రమ్మని మరో రెండు మూడూ సార్లు ఉత్తరాలు రాశాడు. మళ్ళీ జోగారావు గారి వద్దకి వెళ్ళాను. చివరికిఆయన ‘సరే ..మరీ అంత ఆసక్తికరంగా వుంటే అమెరికా వెళ్ళి చదువుకుని రా.. మళ్ళీ తిరిగొచ్చి ఇక్కడ డాక్టరేట్ చెయ్యడం మాత్రం మర్చిపోకు‘ అని చెప్పారు.

సరే అమెరికా వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. ఐతే అందుకు సరిపడా ఆర్థిక వనరులు లేవు. అదే విషయాన్ని మినియాపోలిస్‌లో చదువుతున్న రాజుకి చెప్పాను. తనే అక్కడి డిపార్ట్మెంట్ హెడ్‌తో మాట్లాడి, నా క్వాలిఫికేషన్స్ అన్నీ వివరించి, నాకు టీచింగ్ అసిస్టెంట్ షిప్ వచ్చేలా చూశాడు. యూనివర్సిటీలో చదువుకి ప్రవేశమే కాకుండా టీచింగ్ అసిస్టెంట్ షిప్ కూడా వచ్చింది కాబట్టి నా అమెరికా ప్రయాణానికి మార్గం సుగమం అయింది. అప్పట్లో కేవలం యూనివర్శిటీలో ప్రవేశమే వస్తే స్టూడెంట్ వీసా ఇచ్చేవాళ్ళు.

అదనంగా టీచింగ్ అసిస్టెంట్ లాంటి ఉద్యోగాలుకూడా ఏమైన వస్తే పి-45 అనే ప్రత్యేక తరహా వీసా ఇచ్చేవాళ్ళు. నాకూ ఈ పి-45 వీసానే వచ్చింది.

..అన్నీ కుదిరి..నేనూ అమెరికాకి ప్రయాణమయ్యే రోజు వచ్చింది. నా భార్య వెంకట రమణమ్మని వాళ్ళ పుట్టింట్లో దించి నేను అమెరికాకి ప్రయాణమయ్యాను...

బెంగుళూరు నుంచీ బొంబాయికి ట్రైన్‌లో ప్రయాణం..అక్కడినుంచీ టి.డబ్లు.ఎ విమానంలో న్యూయార్క్‌కి విదేశీ యానం. రాజు చెప్పిన సలహా ప్రకారం వస్తువులన్నీ సర్దుకుని 1954 సెప్టెంబర్ 13 వ తేదీన న్యూయార్క్ లోని లగ్వాడియా ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టాను.. అర్థరాత్రి 12.00 గంటలైంది. అక్కడినుంచీ మినియాపోలిస్ వెళ్ళడానికి ముందు డెట్రాయిట్ లో వున్న మిత్రుడు (ఎం.ఐ.టి.లో క్లాస్ మేట్) గోపాలరావుని చూసివెళ్ళాలని ప్లాన్. ..అప్పటి వరకూ ఎక్కడికి వెళ్ళాలీ, ఏం చెయ్యాలీ ..అస్సలు ఏమీ అంచనాలు లేవు.. ఏదో ఒకటి చేద్దాంలే అనుకుంటూ ఎయిర్‌పోర్ట్ బయటికి వచ్చాను.

నాతో బాటే ఇండియా నుంచీ వచ్చిన స్టూడెంట్స్ మరో నలుగురైదుగురు వున్నారు. వాళ్ళలో ఒకతన్ని పికప్ చేసుకునేందుకు ఒక కేరళ అతను వచ్చాడు. అతడే మమ్మల్ని కూడా ఎక్కడికి వెళుతున్నామని అడిగాడు. మాకేమీ మార్గం లేదని చెప్పడంతో అతడే మమ్మల్ని కూడా తమతో రమ్మనమని మాన్‌హాటన్ లోని ఇంటర్నేషనల్ హౌస్ కి తీసుకెళ్ళాడు. తీరా అక్కడికి వెళ్తే రూములు ఖాళీ లేవు. రేప్పొద్దున్నే ఏమైనా ఖాళీ ఐతే ఇస్తామన్నారు. అందరం అక్కడే లాబీలో అటూ ఇటూ తిరుగుతూ రాత్రంతా గడిపాం.. ఉదయాన్నే ఒక్కక్కరూ ఖాళీ చేస్తుంటే, మాలో ఒక్కొక్కరికీ రూము ఎలాట్ చెయ్యసాగారు. ఆ విధంగా ఉదయం 10 గంటలకి నాకు రూమ్ ఇచ్చారు. వెంటనే స్నానం చేసి, టూరిస్ట్ బస్‌లో మాన్‌హాటన్ అంతా చూసివచ్చి, సాయం కాలం బయలుదేరి బస్సులో డెట్రాయిట్ వెళ్ళాను.

మిత్రుడు గోపాలరావు నన్ను రిసీవ్ చేసుకున్నాడు. మా తెనాలి వాసిని చూడగానే ప్రాణం లేచి వచ్చింది. అతనే నన్ను ఇండియన్ స్టూడెంట్స్ కొంతమంది ఉండే ఒక ఎపార్ట్‌మెంట్‌కి తీసుకెళ్ళి కమ్మటి వెజిటేరియన్ భోజనం పెట్టించాడు. అప్పటికి నేనింకా మాంసాహారం అలవాటు చేసుకోలేదు. .. అక్కడి వాతావరణం చూశాక..'ఫరవాలేదు.. అమెరికాలో మనమూ బాగా చదువుకోవచ్చు' అనిపించింది.


అమెరికా వచ్చిన కొత్తలో

అక్కడి నుంచీ మరునాడే మినియాపోలిస్ వెళ్ళాను ఫ్లైట్‌లో. ముందు అనుకున్నట్లే మిత్రుడు కె.వి.కె రాజు వచ్చి నన్ను రిసీవ్ చేసుకున్నాడు. నేను ముందుగానే సొంతంగా వంట చేసుకునే ఏర్పాట్లు కల్పించమని చెప్పేసరికి తను నా కోసమని ఒక ఎపార్ట్‌మెంట్ తీసుకుని, వంట సామాగ్రి అంతా ఉండేలా ఏర్పాట్లు చేశాడు.. రూములో దిగి సామాన్లు సర్దుకోగానే ఇంటివద్దనుంచీ తెచ్చుకున్న బియ్యం, పప్పులూ పాకెట్లు ఊడదీసి వంట మొదలుపెట్టాను. ఆ విధంగా అమెరికాలో దిగిన మొట్టమొదటి రోజునుంచే నా వంట నేను చేసుకోవడం అలవాటయ్యింది..

విదేశాల్లో మొదటి రోజు నాకలా ఆరంభమయింది.


మినియాపోలిస్ లో ఉండగా నేను, రమణ

కె.వి.కె రాజు, పి.ఆర్.కృష్ణ నా రూమ్ మేట్లుగా చేరే వరకూ రూమ్‌లో ఒక్కడినే 9 నెలలు ఉన్నాను. యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌కి చెందిన పరిశోధనా విభాగమైన రోజ్ నాట్ ఏరోనాటికల్ లేబొరేటరీస్‌లో ఉద్యోగం చేస్తూ, యూనివర్సిటీ ఆఫ్ మినిసోటాలో డాక్టరేట్ చేస్తూ.. 1959 లో పి.హెచ్.డి. పూర్తిచేశాను...

డాక్టరేట్‌ఐతే పూర్తయింది కానీ ఉద్యోగావకాశాలు ఎక్కడా లేవు. పి- 45 నిబంధనలమేరకు డిగ్రీ అవగానే దేశం వదిలి వెళ్ళిపోవాలి.. ఇలాంటి పరిస్థితుల్లో మెసాచుసేట్స్‌లోని ఒక

చిన్న కంపెనీ నాకు ఉద్యోగం ఇవ్వడానికి ముందుకి వచ్చింది (యూనివర్సిటీలోని నా సలహాదారు సిఫారసు మేరకు). వాళ్ళు అమెరికన్ నేవీకి కాంట్రాక్టులు చేస్తుండేవాళ్ళు. అలా నన్ను నేవీ వాళ్ళు ఇమ్మిగ్రేషన్‌కి స్పాన్సర్ చేశారు.. మొత్తానికి ఎలాగైతే 1963లో నాకు ఇమ్మిగ్రేషన్ రావడం, 1965 లో లాక్ హీడ్ మార్టిన్ కంపెనీలో చేరడం జరిగింది. ముందు అలబామా లోనూ, తరువాత 1968 నుంచీ బే-ఏరియాలోనూ అదే కంపెనీకి 34 సంవత్సరాల పాటు పనిచేసి, 1998 డిసెంబర్ లో రిటైర్ అయ్యాను..

విదేశాల్లో తొలిరోజులు అనుకోగానే..ఒక్కసారి జ్ఞాపకాలు యాభై యేళ్ళు వెనక్కి వెళ్ళాయి.. కాలగతిలో ఎన్నో మార్పులూ, ఎంతో అభివృద్ధీ..! ఎప్పటికీ నిలిచే సత్యం మాత్రం ఒక్కటే..'శ్రమించనిదే విజయం రాదు'..!


మినియాపోలిస్ లో ఉండగా నేను కొన్న మొదటి కారు

డాక్టర్ జాస్తి వెంకట రత్తయ్య గారు గత అర్ధ శతాబ్దం పైగా అమెరికా లోని తెలుగు వారందరికీ. ముఖ్యంగా బే-ఏరియా వాసులకీ చిరపరిచితులు. సాంకేతిక, శాస్త్ర విజ్ఞా న రంగాల్లో ఆయన చేసిన సేవలు విశిష్టమైనవి. వివిధ తెలుగు సంస్థల అనుబంధంతో ప్రవాసాంధ్రుల ప్రగతికి ఆయన చేసిన కృషి మరువలేనిది. ఎంత సంఘసేవ చేసినా, ఎంత మందికి గుప్తదానాలు చేసినా ప్రచారాలకు అతి దూరంగా వుండే ఆదర్శనీయుడు శ్రీ రత్తయ్య గారు. విదేశాల్లోని తమ తొలినాళ్ళ ముచ్చట్లని సుజనరంజని తో పంచుకునేందుకు ఈ అవకాశాన్నిచ్చిన వారికి సిలికానాంధ్ర కృతజ్ఞ తలు తెలియచేస్తోంది.